Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్: 9440815774

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 64 | Tuesday 04.02.2025 | Price : Rs.3/- | Pages : 4
అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 64 | మంగళవారం 04.02.2025 | వెల : రూ.3/- | పేజీలు 4

## ప్రజా ప్రభుత్వంలో న్యాయం... జరుగుతుంది

నా పోరాటం ఆగదు.. వారిని వదలను.. రఘురామ మాస్ వార్నింగ్



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వచ్చి తన మనోభావాలు చెప్పాలని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అన్నారు. ప్రతిపక్ష హోదా స్పీకర్, సీఎం ఇస్తారా? ప్రజలు ఇవ్వాలని చెప్పారు. ఎమ్మెల్యే ఎవరైనా 60 రోజులపాటు లీవ్ అడగకుండా సభకు రాకుంటే.. అనర్హత పడుతుందని అన్నారు. తన కస్టోడియల్ టార్చర్‌లో పీవీ సునీల్ పాత్రపై రఘురామ స్పష్టంచేశారు. ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నానని చెప్పారు. దోషులకు శిక్ష పడుతుందనే సంపూర్ణ విశ్వాసం ఉందని అన్నారు. ప్రభుత్వానికి తాను ఒక బాదితుడిగా పిర్యాదు చేశానని

మిగతా 2 లో

## ఢిల్లీ అభివృద్ధి... బీజేపీతోనే సాధ్యం

ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు మీడియా సమావేశం

పాలనా వైఫల్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతోందని వెల్లడి

రాష్ట్రానికి నిధులే లక్ష్యం.. కేంద్రంలో కీలక వ్యక్తితో సీఎం చంద్రబాబు భేటీ

మరోసారి మానవత్వం చాటుకున్న సోనూసూద్..

వాహనాలు అందించినందుకు సోనూసూద్‌కు చంద్రబాబు కృతజ్ఞతలు



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గతరాత్రి ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆయన మిత్రపక్షం బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. తెలుగువారు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఎన్నికల సభల్లో పాల్గొన్నారు. సోమవారం ఢిల్లీలోనే ఉన్న చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఢిల్లీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని అన్నారు. ఢిల్లీ మన రాజధాని అని, మనందరి ఆత్మగౌరవం అని ఉద్ఘాటించారు. “మన దేశానికి వచ్చే విదేశీయులు ముందుగా వచ్చేది ఢిల్లీకే. గత పదేళ్లుగా పాలనా వైఫల్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ప్రపంచంలోనే అత్యధిక వెదర్ పొల్యూషన్, పొలిటికల్ పొల్యూషన్ ఢిల్లీలోనే ఉంది. చేసిన పనులు ఫలితాలు ఇవ్వకపోవడంతో కేజ్రీవాల్ ఏవేవో చెప్పి ప్రజల్ని పొల్యూట్ (కలుషితం) చేయాలని చూస్తున్నారు. ఢిల్లీ గల్లీల్లో మురికినీరు, మంచినీరు కలిసిపోవడంతో ప్రజలు కలుషిత నీరు తాగుతున్నారు. ఢిల్లీలో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే కనిపిస్తోంది... అదే మైనస్. యమునా నది మొత్తంగా కలుషితమైంది. వాయు కాలుష్యం అయితే భరించలేని స్థితిలో ఉంది. ఢిల్లీకి ఎవరూ వచ్చేందుకు ఇష్టపడటం లేదు. బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం కనుక ప్రజలు ఆలోచన చేయాలి” అని సీఎం చంద్రబాబు అన్నారు.

**ఏపీకి మేలు చేసేలా కేంద్ర బడ్జెట్**

ఏపీకి అన్ని విధాలా మేలు చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. ఏఐ, గ్రీన్ ఎనర్జీ వంటి వినూత్నమైన పాలసీలతో మోదీ ప్రభుత్వం ముందుకెళుతోంది. దేశమంటే మట్టికాదోయ్ - దేశమంటే

మిగతా 2 లో

## శ్రీవారి ఆలయంలో.... వార్షిక విశేషపూజ.. ప్రత్యేకత ఏంటంటే!




తిరుమల, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** తిరుమల శ్రీవారి ఆలయంలో తొలిసారిగా వార్షిక విశేషపూజను సోమవారం వసంత పంచమి పర్వదినం సందర్భంగా వైభవంగా నిర్వహించారు. గతంలో శ్రీవారి ఆలయంలో ప్రతి సోమవారం వారపు సేవగా విశేషపూజను నిర్వహించేవారు. శ్రీవారి ఉత్సవమూర్తుల అరుగుదలను అరికట్టి భవిష్యత్తు తరాలకు అందించేందుకు ఏడాదికోసారి మాత్రమే అభిషేకం నిర్వహించాలనే జీయంగార్లు, అర్చకులు, ఆగమ పండితుల సూచన మేరకు వసంతోత్సవం, సహస్ర కలశాభిశేకం, విషేశపూజను ఏడాదికోసారి నిర్వహించాలని గత టీటీడీ బోర్డు నిర్ణయించింది. ఇకపై ప్రతి ఏడాది వసంత

మిగతా 2 లో

## వైసీపీ కార్పొరేటర్లకు... రక్షణ కల్పించండి

పోలీసులకు ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** తిరుపతి కార్పొరేషన డిప్యూటీ మేయర్ ఎన్నికపై ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తమ పార్టీ కార్పొరేటర్లను కిడ్నాప్ చేసే ప్రయత్నం జరుగుతోందని హైకోర్టులో వైసీపీ పిటిషన వేసింది. సోమవారం

మిగతా 2 లో

## గత పాలకుల కారణంగా విద్యావ్యవస్థ... నిర్వీర్యమైంది : లోకేశ్

ఇంజనీరింగ్ విద్యలో నాణ్యత పెంపుదలపై దృష్టి సారించండి: మంత్రి నారా లోకేశ్

మంత్రి నారా లోకేశ్ ను కలిసిన ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు

క్యాలెండర్ ప్రకారం రీయింబర్స్ మెంట్ సొమ్ము విడుదలకు వినతి



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ ::** రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో నాణ్యత పెంచడంపై యాజమాన్యాలు దృష్టి సారించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఉండవల్లి

మిగతా 2 లో

## రాష్ట్రంలో ఉప ఎన్నికలకు... సిద్ధంగా ఉండాలి..




హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** తెలంగాణలో మరికొన్ని రోజుల్లో ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి, మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఉప ఎన్నికల కోసం బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. అయితే సుప్రీంకోర్టులో ఫిబ్రవరి 10న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ జరగనున్న నేపథ్యంలో కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రమంలో రాజ్యాంగం నిర్దేశించిన చట్టం ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపుదారులను రక్షించడం అసాధ్యమని కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

**ఉప ఎన్నికలతోపాటు :** దీంతో తెలంగాణలో ప్రస్తుతం ఎమ్మెల్యేల ఫిరాయింపుల అంశం పెద్ద చర్చకు దారితీస్తుంది. రాజ్యాంగం ప్రకారం, ఫిరాయింపు ఎమ్మెల్యేలు పార్టీ మారడం లేదా

మిగతా 2 లో

## సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా... శ్రీనివాసరావు ఏకగ్రీవం



అమరాతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా వి. శ్రీనివాసరావుమళ్లీ ఎన్నికయ్యారు. నెల్లూరులో జరిగిన 27వ ఏపీ రాష్ట్ర మహాసభల్లో భాగంగా సోమవారం నాడు నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వి. శ్రీనివాసరావును మరోసారి రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 15 మంది రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులతో కలిసి మొత్తం 50మందిని ఈ

మిగతా 2 లో

# సంపాదకీయం

## సామూహిక మరణాలను ఆపాల్సిందే

సంగం నోస్ వద్ద వేర్వేరుగా వచ్చి గంగా, యమునా నదీ ప్రవాహాలు ఒక్కటిగా కలిసిపోయి ముందుకుసాగడం చూడొచ్చు. ఇక్కడ రెండు నదులు వేరువేరు రంగులలో కనిపిస్తాయి. యమునా నదీజలాలు లేత నీలం రంగులో, గంగాజలం కొద్దిగా బురదమయంగా కనిపిస్తుంది. యమునా నది ఇక్కడ గంగానదిలో కలిసి అంతర్ధానమవుతుంది. అంతర్వాహినిగా సరస్వతి నది సైతం సంగమించే ఈ ప్రాంతాన్నే కుంభమేళాలోని ప్రధాన సంగం ఘాట్‌గా చాలా మంది భావిస్తారు. వివిధ సంప్రదాయాలకు చెందిన అఖాడా సాధువులు తమ ఆచారాలు, అమృత స్నానాలను సంగం నోస్ వద్దే ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. శతాబ్దాల క్రితం జనాభా తక్కువ. అందులోనూ ఈ స్థాయిలో భక్తజనకోటి లేదు. కాబట్టి ఆనాడు కుంభమేళాకు విచ్చేసిన భక్తులంతా కేవలం ఈ త్రివేణి సంగమ స్థలి వద్దే పవిత్ర స్నానాలు ఆచరించేవారని స్థానికులు చెబుతున్నారు. దీంతో తాము కూడా ఈ సంగం నోస్ వద్దే పుణ్యస్నానాలు ఆచరించాలని ఈ విషయం తెల్సిన చాలా మంది భక్తులు భావిస్తారు. వాస్తవానికి 4,000 హెక్టార్లలో విస్తరించిన ఘాట్‌లలో సంగం నోస్ కూడా ఒకటి. సంగం నోస్ వద్ద ఎక్కువ మంది స్నానాలు ఆచరించడానికి వీలుపడదు. కానీ జనం ఇక్కడే ఎక్కువగా స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపడంతో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒడ్డు వెంట ఇసుక బస్తాలు వేసి, డ్రెడ్జింగ్ చేసి ఎక్కువ మంది కొనదాకా వచ్చి స్నానాలు చేసేలా దీనిని పెద్ద ఘాట్‌గా మార్చారు. కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి రావడంతో తొక్కిసలాట చోటు చేసుకోవడం దురదృష్టకరం. ఈ దుర్ఘటనలో పదుల సంఖ్యలో భక్తులు మృతిచెందంతో పాటుగా 60 మంది గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా కుంభమేళాతో పాటుగా పర్వదినాలు, ఆధ్యాత్మిక సమ్మేళనాల సందర్భంగా ఇలాంటి తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకున్నాయి. వందలమంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే వేడుకల ఏర్పాట్లలో పాలకులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటనలు గుర్తు చేస్తున్నాయి. భక్తులు సైతం జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఇవి నొక్కి చెప్తున్నాయి. వదంతులు, భక్తుల్లో భయాలు, తామే ముందుండాలనే తొందరపాటు కారణంగా జరిగే తోపులాటలే ఎక్కువగా ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి. గత ఏడాది ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో భోలే బాబా సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలో వందమందికి పైగా ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్లముందు మెదలుతూ ఉంది. బాబా పాదధూళి కోసం భక్తులు ఎగబడ్డంతో జరిగిన ఈ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారిలో అత్యధికులు మహిళలే. మొన్నటికి మొన్న తిరుమల వెంకన్న సన్నిధిలో ముక్కోటి దర్శనం టోకెన్ల కోసం భక్తులు ఒక్కసారిగా ఎగబడ్డంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా, 40 మంది గాయపడ్డారు. ఇలాంటి దుర్ఘటనల్లో ప్రాణాలు కోల్పోయే వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలే ఉంటుండడం గమనార్హం. మహిళలు ఆందోళనకు గురికావడం లేదా కిందపడిపోవడం, తల్లుల చేతుల్లో లేదా వెంట ఉండే చిన్నారులు కూడా వారితో పాటే ఊపిరాడక చనిపోవడమే ప్రధాన కారణం. 2005లో మహారాష్ట్రలోని మంధర దేవి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వెళ్లడం, ఆలయమెట్లపైనుంచి జారి భక్తులు ఒకరిపై మరొకరు పడ్డంతో 340 మంది ప్రాణాలు కోల్పోయారు. 2008లో హిమాచల్‌ప్రదేశ్‌లో నైనాదేవి ఆలయంలో జరిగిన తోపులాటలో 162 మంది భక్తులు దుర్మరణం పాలయ్యారు. కొండచరియలు విరిగిపడుతున్నాయన్న వదంతులే ఈ ప్రమాదానికి కారణం. 2008లో రాజస్థాన్‌లోని చాముండేశ్వరీ దేవి ఆలయంలో, 2013లో నవరాత్రుల సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని రత్నగఢ్ మందిరంలో జరిగిన తొక్కిసలాటలోనూ వందల ప్రాణాలు గాలిలో కలిసిపోవడానికీ ఇలాంటి వదంతులే కారణం. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు ఘటనాస్థలంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉంటాయి. సాయం కోసం క్షతగాత్రులు చేసే ఆక్రందనలు, భక్తుల బ్యాగులు, ఇతర వస్తువులు చెల్లాచెదరుగా పడిపోవడమే కాకుండా ఒక్కోసారి డబ్బు, విలువైన వస్తువులు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాగా మౌని అమావాస్య నాడు పవిత్ర స్నానాలకు పదికోట్ల మంది భక్తులు వస్తారని అధికారులు ముందునుంచీ చెబుతున్నా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు మాత్రం చేయకపోవడమే తొక్కిసలాటకు కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ తొక్కిసలాట జరిగింది. వెలుతురు సరిగా లేకపోవడం, తోపులాటలో ఒకరిపై ఒకరు పడిపోవడం వారిపైనుంచి జనం నడుచుకు పోవడంతో ఎక్కువ మంది చనిపో వడమో, గాయపడ్డమో జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దేశంలో ఇప్పటివరకు జరిగిన అన్ని తొక్కిసలాట ఘటనలకూ దాదాపుగా ఇలాంటివే కారణాలు కావడం గమనార్హం. గతంలో పోలిస్తే ఇప్పుడు ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలకు భక్తుల రాక పెరిగింది. ప్రత్యేక రవాణా సదుపాయాలు, నిర్వాహకులు, ప్రసార మాధ్యమాలు చేసే ప్రచారం ఇందుకు ప్రధా న కారణం. వేదభూమి అయిన భారత దేశంలో అధ్యాత్మిక చైతన్యం మంచిదే కానీ ప్రాణంకన్నా ఏదీ ఎక్కువ కాదనే విషయాన్ని భక్తులు సైతం గుర్తుంచుకోవాలి. వీఐపీలకన్నా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తే ఎంత రద్దీనైనా అదుపు చేయవచ్చనే విషయాన్ని గ్రహిస్తే భవిష్యత్తులోనైనా ఇలాంటి సామూహిక మరణాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.

# ఢిల్లీ అభివృద్ధి...

మనుషులోయ్ అని తెలుగుకవి గురజాడ అప్పారావు చెప్పిన సూక్తిని బడ్జెట్ తొలి వ్యాఖ్యల్లో ప్రస్తావించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. అమరావతికి ఈ ఏడాదిలోనే రూ. 15 వేల కోట్లు కేటాయించబోతున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు ఇచ్చి కేంద్రం ఆదుకుంటుంది. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,157 కోట్లు ప్రకటించిన కేంద్రం ఈ బడ్జెట్ లో రూ. 5,936 కోట్లు కేటాయించింది. విశాఖ స్టీల్ ను ఆదుకునేందుకు బడ్జెట్ కు ముందే కేంద్రం రూ. 11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. ఈ బడ్జెట్ లో రూ. 3,295 కోట్లు కేటాయించారు. విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు, విశాఖ–చెన్నై కారిడార్ కు రూ.285 కోట్లు కేటాయించారు. విశాఖ రైల్వే జోన్ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధికి రూ. 5 కోట్ల నిధులు ప్రకటించారు.

**ఏపీ అభివృద్ధే లక్ష్యం, విమర్శలు పట్టించుకోం**

గత విధ్వంస పాలనతో అభివృద్ధిలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కుపోయింది. విభజనతోనే కాదు... గత ప్రభుత్వ విధ్వంసంతో కూడా ఏపీ దెబ్బతింది. సంపద దోచుకునేవాళ్లు కాదు... పంచేవాళ్లు కావాలి. ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నాము. 7 నెలల్లో రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాము. 15 % వృద్ధి రేటు లక్ష్యంగా ముందుకెళు తున్నాము. దావోస్ పర్యటన విజయవంతమైంది. పలు అంతర్జాతీయ పరిశ్రమలు ఏపీకి రాబోతున్నాయి. ఉద్యోగ, ఉపాధి కల్పన ధ్యేయంగా అడుగులు వేస్తున్నాం. అభివృద్ధి , సంక్షేమం రెండూ సమానంగా ప్రజలకు అందిస్తున్నాము. ఏఐ, గ్రీన్ ఎనర్జీ, అగ్రికల్చర్, జీరో పావర్టీ, ఎంఎస్ఎంఈల విషయంలో కేంద్రం ఆలోచనలకు తగ్గట్టు ఏపీ అనుసరిస్తోంది. కొందరు రాజకీయ లబ్ధి కోసం బడ్జెట్‌లో ఏపీకి చేసిన కేటాయింపులపై విమర్శలు చేస్తున్నారు. బడ్జెట్‌లో ఏపీ పేరు ప్రస్తావనపై మాట్లాడుతున్నారు. కేంద్రం మన రాష్ట్రానికి నిధులు కేటాయించి ఆదుకోవడం ముఖ్యం కానీ ప్రతిసారీ పేరు చెప్పాల్సిన అవసరం లేదు. కేంద్రం ఇచ్చే చేయూతతో దేశంలోనే ఏపీని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం... అని చంద్రబాబు వివరించారు.

**రాష్ట్రానికి నిధులే లక్ష్యం.. కేంద్రంలో కీలక వ్యక్తితో సీఎం చంద్రబాబు భేటీ**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులే లక్ష్యంగా సీఎం నారా చంద్రబాబునాయుడు సోమవారం 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగడియాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం సుమారు రెండు గంటలపాటు జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తొలుత 45 నిమిషాల అనుకున్న భేటీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల పరిణామాలు, ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై రెండు గంటల పాటు చర్చ జరిగింది. ఏపీ ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల వైసీపీ దుష్పరిపాలన, పలు రంగాల వారీగా జరిగిన నష్టంపై 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఏపీ తక్కువ జీడీపీ ఉండటం, దానికి గల కారణాలపై కూడా ప్రజంటేషన్‌లో వివరించారు. ఇటీవల నీతి ఆయోగ్ ఇచ్చిన ఆర్థిక ఆరోగ్య నివేదికలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి గురించి చెప్పిందని, రాష్ట్రం అప్పు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నివేదించిందని చంద్రబాబు గుర్తుచేశారు.

**ఏపీ చాలా నష్ట పోయింది.. :** 2014–19 మధ్య అభివృద్ధికి, ఆ తర్వాత ఐదేళ్లలో చోటు చేసుకున్న దుష్పరిపాలనతో పొంతన లేకుండా పోయిందని, రాష్ట్రం చాలా నష్ట పోయిందని ప్రజంటేషన్‌లో చంద్రబాబు తెలిపారు. 2019–24 మధ్య జరిగిన ఆర్థిక విధ్వంసంపై ప్రత్యేకంగా ప్రజంటేషన్‌లో సీఎం చంద్రబాబు వివరించారు. దీని కారణంగా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చూపుతున్న ప్రభావం గురించి ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులు తీసుకువచ్చారని, దానికి తోడు మరో రూ. లక్షన్నర కోట్లకు పైగా... పెండింగ్ బిల్లులు పెట్టిపోయారని చంద్రబాబు తెలిపారు. ఈ పరిణామాల నుంచి రాష్ట్రాన్ని ఆర్థికంగా గట్టెక్కించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రజంటేషన్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. పోర్టులు, లాజిస్టిక్ పార్కులు, పరిశ్రమలు వచ్చేందుకు అనువైన వాతావరణాన్ని ఎలా తయారు చేస్తోంది. పోర్టు ఆధారిత అభివృద్ధికి ఉన్న మార్గాలపై కూడా వివరించి అందుకు సహకరించాలని కోరారు.

**ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేలా చర్యలు.. :** పోర్టు ఆధారిత, పరిశ్రమల ఆధారిత అభివృద్ధి ఎలా చేయాలన్న దానిపై ఇరువురు నేతలు కీలకంగా చర్చించారు. డీప్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ, ఏఐకు సంబంధించిన విషయాలను ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలపై ప్రజంటేషన్‌లో సవివరంగా సీఎం చంద్రబాబు చెప్పారు. తిరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూనే... అన్ని అంశాల్లో ఆర్థిక సంఘం కూడా తగిన సహకారం ఇవ్వాలని కోరారు. ప్రజంటేషన్ అనంతరం చాలా అంశాలపై చంద్రబాబు, అరవింద్ పనగడియా చర్చించారు. దేశంలో ఆర్థిక వ్యవస్థలను బలోపేతం దిశగా తీసుకువెళ్లడంలో చంద్రబాబు తీసుకున్న చర్యల గురించి అరవింద్ పనగడియా ప్రస్తావించారు.

**పోర్టుల ద్వారానే ఎక్కువ ఆదాయం.. :** ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏడు రాష్ట్రాలు పోర్టుల ద్వారానే ఎక్కువ ఆదాయం సాధిస్తున్నారని, తెలంగాణ మాత్రమే అందుకు భిన్నంగా ఉందని ఇరువురి మధ్య చర్చించారు. తెలంగాణ కూడా ఎక్కువగా హైదరాబాద్ ఆధారంగానే అభివృద్ధి పథంలో ఉందని, గతంలో చేపట్టిన చర్యలు హైదరాబాద్‌ను ప్రపంచానికి అనుసంధానం చేశాయని పనగడియా పేర్కొన్నారు. బిల్ గేట్స్ హైదరాబాద్ రావడం, దాని కొనసాగింపుగా.. చాలా ప్రపంచ సంస్థలు ఎలా హైదరాబాద్‌కు అనుసంధానం అయ్యాయన్న విషయాను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆర్థిక వ్యవహారాల్లో గుజరాత్, మహారాష్ట్ర మోడల్స్‌తో పాటు సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రయోగంలో హైదరాబాద్ మోడల్ ఎలా విజయవంతం అయిందో ఇరువురి మధ్య చర్చ జరిగింది. వీటితో పాటు 2014–19 మధ్య స్వచ్ఛ భారత్, డిజిటల్ కరెన్సీ వంటి విషయాల్లో చంద్రబాబు ఇచ్చిన నివేదికలు, ప్రస్తుతం వాటి ఫలితాలను చర్చ సందర్భంగా అరవింద్ పనగడియా ప్రస్తావించారు.

**మరోసారి మానవత్వం చాటుకున్న సోనూసూద్..**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ప్రముఖ నటుడు సోనూసూద్ మర్యాదపూర్వకంగా కలిశారు. తన ట్రస్టు తరఫున ఏపీకి నాలుగు అత్యాధునిక అంబులెన్స్‌లను సోనూసూద్ అందించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన అంబులెన్స్‌లను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం వాహనాలు అందించినందుకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కరోనా సమయంలో ఆయన చేసిన సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. సీఎం చంద్రబాబుతో భేటీ అనంతరం సోనూసూద్ మీడియాలో మాట్లాడారు. ఈ సందర్భంగా సోనూసూద్ మాట్లాడుతూ.. “ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ ఫెసిలిటీ అభివృద్ధి చేయడంలో మా వంతు కృషి చేస్తున్నా. చాలా మంది అంబులెన్స్‌లు కావాలని అడిగారు. అందుకే ఎమర్జెన్సీ లైఫ్ సేవింగ్ కోసం వాటిని అందిస్తున్నా. ఏపీ ప్రజలు నా హృదయానికి చాలా దగ్గరగా ఉంటారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. ఏపీ నా రెండో ఇల్లు లాంటింది. ఇక్కడి ప్రజలు నన్ను ఉన్నతస్థాయిలో నిలబెట్టారు. నా భార్య ఏపీకి చెందిన మహిళే. ఎవ్వరికీ ఏ అవసరం వచ్చినా ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉంటా. ప్రతి ఒక్కరూ గొప్పవారు అయ్యాక సమాజానికి సేవ చేయాలి. నటులు సైతం సినిమాల్లో నేమ్, ఫేమ్ సంపాదించాక తిరిగి సొసైటీకి ఎంతో కొంత ఇవ్వాలి. కొవిడ్ సమయం నుంచీ నేను చంద్రబాబుతో టచ్‌లో ఉన్నా. మొదటిసారిగా ఏపీకే అంబులెన్స్‌లు ఇచ్చా. నా ఫౌండేషన్ ప్రతి సామాన్యుడి కోసం పని చేస్తోంది. నేనూ సామాన్యుడిగానే ఉండాలని అనుకుంటా. ప్రజలకు సేవ చేయడానికే రాజకీయ నాయకులు ఉన్నారు. సీఎంకు ఇప్పుడే నాలుగు అత్యాధునిక అంబులెన్స్‌లు ఇచ్చా. అందులో టాప్ ఫెసిలిటీలు ఉన్నాయి. మేము ఇచ్చే వాహనాలను నడపేందుకు డ్రైవర్లు కావాలి, మెయింటెనెన్స్ చేయాలి. ఆ సపోర్ట్ ఏపీ ప్రభుత్వం నుంచి వస్తోంది. రాష్ట్రంలో వాటి అవసరం ఎవ్వరికి ఉన్నా వాడుకోవచ్చు. సీఎం చాలా బాగా రిసీవ్ చేసుకున్నారు. ఇది చాలా మందిని ఇన్‌స్పైర్ చేస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు నన్ను ఏపీకి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండమంటే నేను రెడీ. తెలుగులో సినిమాలు చేయలేకపోవడానికి ఫతే సినిమా నిర్మాణంలో బిజీగా ఉండడమే కారణం. ఈ సినిమాకు సిరీస్ కూడా ప్లాన్ చేస్తున్నానని” చెప్పారు.

# గత పాలకుల కారణంగా విద్యావ్యవస్థ...

నివాసంలో ఇంజనీరింగ్ కళాశాలల మేనేజ్ మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు నేడు మంత్రి లోకేశ్ ను కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని, ప్రాథమికస్థాయి నుంచే పరివర్తన తేవాలన్నది తమ లక్ష్యమని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యలో గత 10 సంవత్సరాలుగా సంస్కరణలు లేవని, తాను హెచ్ ఆర్ డి మంత్రి అయ్యాక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. విద్యావ్యవస్థలో నైతిక విలువలతో కూడిన సంస్కరణలు తీసుకురావాలన్నది తమ ఉద్దేశంగా పేర్కొన్నారు. సంస్కరణలు అమలుచేసే క్రమంలో ఏవైనా తప్పులు దొర్లితే సరిదిద్దుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలు ఉండవని, చర్చలు, సంప్రదింపుల ద్వారానే ఏదైనా విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ ఏడాది ఆర్టీఎఫ్ స్కాలర్ షిప్ లకు సంబంధించి తొలి విడతలో రూ.788 కోట్లకు గాను, ఇప్పటికే 571.96 కోట్లు విడుదల చేశామని, రెండు, మూడు రోజుల్లో మిగిలిన 216.04 కోట్లు కూడా విడుదల చేస్తామని తెలిపారు. కాలేజీలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్, ఆర్ అండ్ డీ, ఇన్నొవేషన్స్ పై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్లేస్ మెంట్స్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకురావాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించి ఇంజనీరింగ్ విద్య నాణ్యత పెంచేందుకు అందరి అభిప్రాయాలు తీసుకుంటామని లోకేశ్ అన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధులు మాట్లాడుతూ... ఇంజనీరింగ్ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీఎంబర్స్ మెంట్ సొమ్మును ఎప్పటికప్పుడు క్యాలండర్ ప్రకారం విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఫీజులు గిట్టుబాటుగా లేవని, వాటిని సవరించాలని కోరారు. ఈ విషయంలో ముందస్తుగా కసరత్తు ప్రారంభించాలన్నారు. ఎంసెట్ షెడ్యూలును నిర్ణీత సమయం ప్రకారం విడుదల చేయాలని, ఎంసెట్ లో 3 కౌన్సిలింగ్స్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో చదివిన విద్యార్థుల ప్లేస్ మెంట్స్ విషయంలో ప్రభుత్వం చొరవచూపాలని, ఇందుకోసం స్టేట్ లెవల్ జాబ్ మేళా తో సహా యూనివర్సిటీల్లో ఆయా కంపెనీలను రప్పించి జాబ్ మేళాలు నిర్వహించాలన్నారు. అటెండెన్స్ విషయంలో వెయిటేజి విధానాన్ని అమలుచేస్తే సత్ఫలితాలు ఉంటాయని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో మోటివేషన్ వచ్చి హాజరుశాతం పెరిగే అవకాశం ఉందని అన్నారు. రాష్ట్రంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రిసర్చ్ (ఎన్ఐటీటీపీఆర్) ను పునరుద్దరించాలని, వీలైతే 3చోట్ల ఈ కేంద్రాలను ఏర్పాటుచేసి అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నేషనల్ క్రెడిట్ అండ్ క్వాలిటీ ఫ్రేమ్ వర్క్ (ఎన్ సీక్యూఎఫ్) కు లోబడి మైక్రో సర్టిఫికేషన్ ను అమలుచేయాలని సూచించారు.

# రాష్ట్రంలో ఉప ఎన్నికలకు...

శాసనసభ నుంచి అనర్హత పొందడం అనేది కీలక అంశంగా మారింది. అయితే దీనిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఈనెల 10న సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. సుప్రీంకోర్టులో వచ్చే ఆదేశాలను బట్టి జవాబుదారీగా ఎటువంటి నిర్ణయం తీసుకోబడినా, పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, తదుపరి ప్రయత్నాల కోసం చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు.

**గతంలో కూడా.. :** ఈ విచారణలో ముఖ్యంగా పార్టీ మారిన పలువురు ఎమ్మెల్యేలు ప్రత్యర్థుల నుంచి ఎదురు దాడి ఎదుర్కొంటున్నారు. ఈ అంశం తెలంగాణలో ప్రస్తుతం రాజకీయ భవిష్యత్తుపై అనేక ప్రశ్నలను రేపుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వచ్చే పరిణామాలు, కొత్త వ్యూహాలను మరింత జాగ్రత్తగా అంచనా వేస్తుందని తెలుస్తోంది. గతంలో కూడా అనేక ఇతర రాజకీయ పార్టీల నేతలు.. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల్లో గెల్చిన తర్వాత పలు పార్టీలకు మారిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారిన ప్రతి సారీ కూడా ఈ పార్టీ ఫిరాయింపుల అంశం తెరపైకి వస్తుంది. ఈ క్రమంలో ఈసారి సుప్రీంకోర్టు దీనిపై ఎలాంటి తీర్పు వెలువరిస్తుందో చూడాలి మరి.

# శ్రీవారి ఆలయంలో....


పంచమి పర్వదినాన వార్షిక విశేషపూజను సర్కార్ (ఏకాంతం)గా టీటీడీ నిర్వహించనుంది. ఈ మేరకు తొలిసారిగా వార్షిక విశేషపూజను వసంత పంచమి సందర్భంగా శ్రీవారి ఆలయంలోని కళ్యాణ మండపంలో సోమవారం వైభవం నిర్వహించారు. ముందుగా అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని వేంచేపు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చతుర్దశ కలశావాహనం గావించి పుణ్యహవచనం, వివిధ క్రతువులను నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రయాగ్ రాజ్ లో మహా కుంభ మేళా సందర్భంగా టీటీడీ ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనా ఆలయ ప్రాంగణంలో సోమవారం వసంత పంచమి పర్వదినం పురస్కరించుకుని సందర్భంగా శ్రీ శ్రీనివాస స్వామికి ప్రత్యేక ఊంజల్ సేవ నిర్వహించారు. వేద పండితుల వేదమంత్రాల నడుమ శ్రీ స్వామివారు వీణాపాణియై సరస్వతి అలంకారంలో ఊయలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించారు. విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి ఊంజల్ సేవను తిలకించి ఆనందంతో పరవశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శివప్రసాద్, హెచ్ డీపీపీ అదనపు సెక్రటరీ రామ్ గోపాల్, ఏఈవో రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు. మరోవైపు తిరుమల శ్రీవారి సన్నిధిలో నిర్వహించే రథసప్తమి వేడుకలకు సంబంధించి.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీటీడీ భారీ ఏర్పాట్లు చేసింది.

# వైసీపీ కార్పొరేటర్లకు...



జరిగిన ఎన్నికల ప్రక్రియ సమయంలోనూ ఇబ్బందులకు గురివేశారని పిటిషన్‌లో పేర్కొంది. తమ కార్పొరేటర్లకు రక్షణ కల్పించాలని కోరింది. వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. కార్పొరేటర్లకు రక్షణ కల్పించాలని వైసీపీ వినతిపత్రం అందజేయాలని వైసీపీకి ఏపీ హైకోర్టు సూచించింది. కార్పొరేటర్లు బయల్దేరి వెళ్లే దగ్గర నుంచి సెనెట్ హాల్‌కు చేరుకునే వరకు రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీచేసింది. కాగా తిరుపతి మున్సిపల్ ఎన్నికల వేళ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓటింగ్‌కోసం వైసీపీ కార్యకర్తలు ఎస్వీ యూనివర్సిటీకి వెళ్తున్న సమయంలో బస్సుపై జనసేన, టీడీపీ మూకలు దాడులకు పాల్పడ్డాయి. అంతకుముందు చిత్తూరు భాస్కర్ హోటల్‌లో వున్న వైసీపీ మహిళా కార్పొరేటర్లపై జనసేన ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు కుమారుడు అరణి మదన్ దాడికి యత్నించారు. కార్పొరేటర్లను కాపాడేందుకు వెళ్లిన తిరుపతి వైసీపీ ఇన్‌చార్జీ భూమన అభినయ్ రెడ్డిపై మేయర్ ఎన్నికను నేటికి వాయిదా వేశారు. ఈ క్రమంలోనే టిడిపి దౌర్జన్యాలపై వైసీపీ నేతలు సీరియస్‌గా స్పందించారు. మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక సమయంలో కూటమి నేతల ఆరాచకాలపై కమిషన్‌కు వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. విజయవాడ బందర్ రోడ్డులోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని కలిసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు వినతిపత్రం అందజేశారు. తిరుపతి, హిందూపురం, నెల్లూరు మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ కార్పొరేటర్లపై కూటమి నేతలు దాడికి తెగబడ్డారని ఆరోపించారు. పోలీసులు కూడా చోద్యం చూసినట్లుగా ఉండిపోతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లలో జరుగుతున్న ఎన్నికలను వాయిదా వేయాలని కోరారు.

# సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా...



సందర్భంగా ఎన్నుకున్నారు. ఏడుగురు కార్యదర్శివర్గ సభ్యులతో కలిసి మొత్తం 50 మందిని ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. ఏడుగురు ఆహ్వానితులు, ఐదుగురు ప్రత్యేక ఆహ్వానితులతో కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా వెంకటేశ్వరరావు, బాబురావు, ప్రభాకర్‌రెడ్డి, రమాదేవి, తులసీదాస్, వెంకటేశ్వర్లు, లోకనాథం, సురేంద్ర, సుబ్బరావమ్మ, రాంభూపాల్, ఉమమహేవ్వరరావు, బలరాం, మూలం రమేస్, ఏవీ నాగేశ్వరరావును ఎంపిక చేశారు.

**శ్రీనివాసరావు ప్రస్థానమీదీ..!**

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన వంకాయపాటి శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా మద్రిపూడి మండలం కెల్లంపల్లిలో ఓ సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. 1960లో జన్మించిన ఆయన ప్రకాశం జిల్లాలోనే ప్రాథమిక ఉన్నత విద్యను అభ్యసించారు. 1974–76లో నెల్లూరు జవహర్ భారతి కాలేజీలో ఇంటర్‌పూర్తి చేశారు. డిగ్రీ చదివే సమయంలోనే ఆయన ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారు. మొదటి సంవత్సరంలోనే విద్యార్థుల సమస్యలపై పోరాటం చేశారు. 1978–79లో ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1979 నుంచి 1982 వరకు కార్యదర్శిగానూ పనిచేస్తూ న్యాయ విద్యలో చేరారు. 1982–84లో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తూనే రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. పలు రాష్ట్ర స్థాయి ఆందోళనల్లో పాల్గొన్నారు. 1985లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1992లో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. 2000లో ప్రజాశక్తి పత్రిక సంపాదకుడిగా పనిచేశారు. 2005లో కేంద్ర కమిటీ సభ్యుడిగా, అనంతరం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. దళిత శోషణ్ ముక్తి మంచ్ వ్యవస్థాపక కన్వీనర్, జాతీయ కార్యదర్శిగా వ్యవహరించారు.

# ప్రజా ప్రభుత్వంలో న్యాయం...



రఘురామ తెలిపారు. శాసన సభ్యుడు ఎవరైనా 60 రోజుల పాటు సరైన కారణం చెప్పకుండా అసెంబ్లీకి రాకపోతే అనార్హత వర్తిస్తుందని... అప్పుడు పులివెందులకు ఉపఎన్నికలు వస్తాయని రఘురామ కృష్ణరాజు చెప్పారు. జగన్ అసెంబ్లీకి రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నానని చెప్పారు. ఈ ప్రభుత్వంపై సంపూర్ణ విశ్వాసం ఉందని.. దోషులకు శిక్ష పడుతుందని తెలిపారు. గతంలోతాను ఎన్నో ఫిర్యాదులు చేశానని గుర్తుచేశారు. సమాజాన్ని మతాలు, కులాల వారిగా విడగొట్టే విధంగా వైసీపీ నేతలు మాట్లాడారని ఆరోపించారు. సునీల్ కుమార్ అతి తెలివి తేటలు ఉపయోగించి యూట్యూబ్‌లో ఉన్న వీడియోలు తీసేశారని చెప్పారు. ప్రభుత్వానికి తాను ఒక బాధితుడిగా ఫిర్యాదు చేశానని తెలిపారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు ఇస్తే దానిపై ఐపీఎస్ అధికారి ఇష్టానుసారంగా మాట్లాడారని అన్నారు. సునీల్ కుమార్‌ను ఎప్పుడు సస్పెండ్ చేస్తారని ప్రభుత్వాన్ని అడిగానని అన్నారు. తన కస్టోడియల్ టార్చర్‌పై పోరాటం ఆగదని రఘురామ స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయ సంఘం నాయకులు..
## జగన్మోహన్ రెడ్డిని పరామర్శించిన...
## మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:**అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణం అయ్య ప్ప రెడ్డి కాలనీలో నివాసముంటున్న ఉపా ధ్యాయ సంఘం నాయకుడు జగన్మోహన్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి సోమవారం ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని మాట్లాడి వివరాలు అడిగి తెలుసు కున్నారు త్వరగా కోలుకోవాలని ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే ఆకాంక్షించారు ఆయన వెంట మండల కన్వీనర్ దండు జగన్మోహన్ రెడ్డి సర్పంచ్ హబీబ్ భాష. పెద్దోడు చక్రధర్ ద్వారకనాథరెడ్డి రమేష్ రెడ్డి కాలనీ చిన్న కుసుమ శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వేలూరు గంగమ్మ కుంభాభిషేక పూజల్లో ...
## పాల్గొన్న ఎస్ సీ వీ దిలీప్ నాయుడు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:** పిచ్చాటూరు మండలంలోని వేలూరులో నిర్మించిన గంగమ్మ ఆలయం కుంభాభిషేక పూజల్లో సీనియర్ టిడిపి నాయకులు మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తనయులు ఎస్.సీ.వీ దిలీప్ నాయుడు పిచ్చాటూరు మండలం మాజీ జడ్పిటిసి సుమాంజలి ఆహ్వానం మేరకు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయం కార్యనిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు రాజానాయుడు, ఢిల్లీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## సోక్రటీస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు...
## ఘనంగా వసంత పంచమి వేడుకలు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:** సోక్రటీస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ దేవలంపేటనందు వసంత పంచమి సందర్భంగా నూతన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం వేద పండితుల చేత ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సోక్రటీస్ స్కూల్ వైస్ చైర్మన్ హరీష్ .చైర్మన్ అనిత .ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు అని కరస్పాండెంట్ గుణశేఖర్ తెలియజేశారు.



## కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ...
## నూతన డ్రైనేజి నిర్మాణ పనులను ...
## పరిశీలిస్తున్న కమిషనరు వి.శ్రీనివాసరావు

**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 03:**కుప్పం మునిసిపాలిటీ మౌలిక వసతుల అభివృద్ధి కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరు చేసిన స్పెషల్ గ్రాంటు నిధుల ద్వారా కుప్పం పురపాలక సంఘం సామగుట్టపల్లి సచివాలయ పరిధిలోని 1 మరియు 2వ వార్డుల యందు ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి నూతన డ్రైనేజిలను నిర్మాణం చేయుటకు గాను సదరు ప్రాంతాలను పరిశీలించడం, జరిగినది. ఈ కార్యక్రమం లో కుప్పం మునిసిపల్ కమిషనరు వి. శ్రీనివాసరావు,మునిసిపల్ ఎ ఇ, టిడిపి నాయకులు మరియు స్తానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ సామాజిక తనిఖీలో కొండను తవ్వి...
# చిట్టి ఎలుకను పట్టినట్లుంది వ్యవహారం

### –ఉపాధి హామీ పనులు జరిగింది 11 కోట్ల68 లక్షల81వేల 146
### – రికవరీ చేసింది 28368

**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:**ఉపాధి హామీ సామాజిక తనిఖీలో కొండను తవ్వి చిట్టెలుకను పట్టినట్లుంది... ఏప్రిల్20 23 సంవత్సరం నుంచి మార్చి2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులు 11 కోట్ల 68 లక్షల81వేల146 రూపాయలు పనులు చేయగా అందులో రికవరీ మాత్రం28368 రూపాయలు రికవరీ చేసినట్లు పిడి రవికుమార్ తెలిపారు... ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని పిడి రవికుమార్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏపీడి సునీల్ ఎంపీడీవో మురళీమోహన్ ఏపీవో చంద్రశేఖర్ టి ఏ నౌషద్, బాల, రామ్మూర్తి, రేఖ నోమేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ లు రాజేష్ రవి నేతాజీ,వెంకటేష్ శకుంతల జ్యోతి రేఖ జీవా సదా మునిరత్నం ఆనంద్, సుధాకర్ సురేష్, రామచంద్రారెడ్డి లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



## తిరుమల శ్రీవారికి 14 టన్నుల కూరగాయల వితరణ

**పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:**పలమనేరు నియోజకవర్గం నుండి ఆది వారం నాడు తిరుమల తరిగొండ అన్నదాన సత్రానికి వడ్డిపల్లి కూరగాయల మార్కెట్ నుండి 14 టన్నుల కూరగాయలను తిరు మల శ్రీవారి వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్లో తిరుమల దేవస్థానం లారీకి కూరగాయల ను నింపి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి సేవకులు కాపుపల్లి రవీంద్రారెడ్డి, మాట్లాడుతూ తిరుమల లో రథసప్తామి సందర్భంగాఅశేషంగా విచ్చేసే భక్తుల అన్నదానానికి గాను శ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్యానికి కూరగా యలు తరలిస్తున్నట్లు తెలిపారు అలాగే కూరగాయల వాహనదారులకు సిలిక్ ఫామ్ నందు గల పౌల్ట్రీ మెటీరియల్స్ షాప్ నిర్వహించు. జై సింగ్ భోజన సౌక ర్యాలు కల్పించి ప్రత్యేక పూజలు నిర్వ హించి తిరుమలకు సాగనంపారు. ఈ కార్య క్రమంలో వడ్డిపల్లి మార్కెట్ యాజమా నులు రైతులు సహాయ సహకారాలు అందించి తిరుమలకు తరలించారు.



## శిరస్త్రాణం తలకు ప్రాణం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:**అన్నమయ్య జిల్లా పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీలేరు లో పీలేరు మోటర్ వెహికల్ ఇన్స్పె క్టర్, షీ సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సుధాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే రోడ్డు భద్రత విద్యను అందించాలని తద్వారా సురక్షితమైన మరియు ప్రమాద రహితమైన భారత రోడ్లను మనం చూడవచ్చని పేర్కొన్నారు ఈ సందర్భంగా మోటార్ సైకిల్ కలిగిన ప్రతి విద్యార్థి లేదా యువకుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ను పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పీలేరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయ కుమారి ప్రపంచంలో అన్నింటికంటే అత్యంత విలువైనది మనిషి ప్రాణమని అది రోడ్డు ప్రమాదాలతో తీవ్ర ప్రమాదంలో పడుతోందని తెలిపారు. ఏటా ఒకటిన్నర లక్షకు పైగా ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని ఇది అత్యంత విషాదకరమైన అంశమని తెలిపారు రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ప్రభుత్వాలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా తోడైనప్పుడే వాటిని సమర్థవంతంగా నివారించవచ్చని తెలియజేశారు. రోడ్డు ప్రమాదానికి గురవుతున్న వారిలో ఎక్కువగా యువత ఉందని వారి మరణం ఆయా కుటుంబాలకు తీరని విషాదమే కాక కాక దేశానికి కూడా పెద్ద లోటు అని పేర్కొన్నారు. కాబట్టి ఈ విషయమై తల్లిదండ్రులు అధికారులు ఉపాధ్యాయులు యువత అందరూ బాధ్యత వహించి ప్రమాద రహిత భారతదేశ నిర్మా ణానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పీలేరు పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం మిగిల్చే విషాదం ఆ కుటుంబాన్ని ఎప్పటికీ కోలుకోనియదని కాబట్టి వాహనంలో ఇంటి నుంచి బయలుదేరిన ఒక వ్యక్తి క్షేమంగా ఇల్లు చేరేవరకు ఆ కుటుంబం వేయికళ్లతో అతని రాక కోసం ఎదురుచూస్తూ ఉంటుందని ఆ విషయాన్ని గుర్తించుకొని డ్రైవింగ్ చేయాలని సూచించారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న పీలేరు ఆర్టీసీ డిపో ఇన్చార్జి మేనేజర్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు ప్రమాద రహిత ప్రయాణానికి మారుపేరుగా ఉందని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి వ్యక్తిగత వాహనాల కంటే సామాజిక రవాణాను ఆదరించి ప్రమాదాలను తగ్గించాలని కోరారు. ఈ సంస్థ వ్యవస్థాపకులు టీవీఎస్ లక్ష్మీ మాట్లాడుతూ వాహనాన్ని నడిపే వ్యక్తి పూర్తి మానసిక శారీరక ఆరోగ్యంగా ఉన్నప్పుడే సురక్షితమైన డ్రైవింగ్ చేయగలరని ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడానికి చక్కని ఆహార వ్యాయామ నియ మాలు పాటించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో రోడ్డు భద్రత యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో బీకాం విద్యార్థి వెన్నెల మొదటి స్థానం తానియా సుల్తానా రెండవ స్థానం వంశీ ప్రసాద్ నాయక్ మూడో స్థానం పొందారు మొదటి స్థానం పొందిన వెన్నెలకు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమారి హెల్మెట్ ను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం శివరామిరెడ్డి అధ్యాపకులు సంధ్య ఆదూరి సుధాకర్ రెడ్డి ఎల్లయ్య వెంకటరత్నం కిషోర్ కుమార్ రెడ్డి రాయల సుధాకర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫీజు ఫోర్ పోస్టర్ ఆవిష్కరణ


### వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రధర్



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:**అన్నమయ్య జిల్లా పీలేరు వైఎస్ఆర్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి సుంకర చక్రధర్ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డితో కలిసి పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుంకర చక్రధర్ మాట్లాడుతూ పేదరికం అనేది ఉన్నత చదువులకు అడ్డంకి కాకూడ దన్న ఆలోచనతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ పథకం వల్ల ఎంతో మంది పేదలు ఇంజనీరింగ్, మెడిసిన్ అభ్యసించి జీవితంలో స్థిరపడ్డారని తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు అమ్మ ఒడి పథకం అమలు చేశారన్నారు. ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారి కోసం విద్యా దీవెన, వసతిదీవెన పథకాలు తెచ్చారని చెప్పారు. ఐదేళ్ల జగన్ పాలనలో విద్యారంగానికి రూ.73 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతోందని, త్వరలోనే అకడమిక్ ఇయర్ కూడా ముగుస్తుందన్నారు. ఇప్పటికే చాలా చోట్ల ఫీజుల కోసం కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రూ.700 కోట్లు విడుదల చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. దీని వల్ల కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు కూర్చొబెడతామని అంటున్నారని... ఇప్పటికే ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువుల కోవిమర్శించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు రూ.3900 కోట్లు చెల్లించాలని, ఇదే డిమాండ్‌తో ఫిబ్రవరి 5వ తేదీన జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఫీజు పోరు చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని, కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీ నర్ జగన్ మోహన్ రెడ్డి,టెలికామ్ బోర్డు మెంబెర్ ఆనందబాబు ,మాజీ ఎంపీపీ పెద్దోడు,ద్వారకానాథ రెడ్డి ,ఎస్ టి సెల్ కన్వీనర్ కాలనీ చిన్న రమేష్ రెడ్డి,రియాజ్, బాలకృష్ణ విజయ్ కుమార్,కుసుమ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే పట్టణంలో దొంగలు

### భయభ్రాంతులకు గురవుతున్న పట్టణవాసులు





**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:** కుప్పం మున్సిపాలిటీలో పట్టపగలే రెండుచోట్ల దొంగతనాలు జరిగాయని సామాజిక మాధ్యమాలలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇందులో పట్టణ పరిధిలోని సిరికల్చర్ కార్యాలయ సమీపంలో గల ప్రభుత్వ ఉపాధ్యాయుల ఇంటిలో దొంగతనం జరిగిందని బాధితులు తెలిపారు. వారి వివరాల మేరకు గణపతి, అముదా దంపతులు వృత్తిరీత్యా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నామని, ఉదయం ఉద్యోగానికి వెళితే సాయంకాలనికి ఇంటికి తిరిగి వస్తామన్నారు. ఈ మధ్య సమయంలో ఇంటిలో ఎవరు లేకపోవడానికి అదునుగా తీసుకున్న దొంగలు సోమవారం దొంగతనానికి దిగినట్టు తెలిపారు. ప్రతిరోజు లాగే ఉద్యోగానికి వెళ్లి సాయం కాలానికి ఇంటికి వచ్చి చూస్తే, ఇంటిలో దొంగతనం జరిగినట్టు గుర్తించామన్నారు. ఈ దొంగతనంలో రెండు లక్షల రూపాయల నగదు, రెండు కేజీల వెండి, 250 గ్రాముల బంగారు దొంగతనానికి గురైనట్టు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే సామాజిక మాధ్యమాలలో ప్రచారం జరుగుతున్నట్టు పట్టణంలో జరిగిన మరో దొంగతనంపై నిజా నిజాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.



## అంతరాష్ట్ర మోటార్ సైకిల్ దొంగల అరెస్ట్

### తొమ్మిది లక్షల విలువైన మోటర్ సైకిళ్ళ స్వాధీనం చేసుకున్న పోలీసులు



**శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి03:** కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలో జనవరి 28 నుండి 30తేదీ వరకు జరిగిన వరుస మోటార్ సైకిల్ దొంగతనాల గురించి వాహనదారులు ఇచ్చిన పోలీసు ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ మణికంఠచందోలు ఉత్తర్వుల మేరకు కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, అర్బన్ సీఐ పి శంకరయ్య, పర్యవేక్షణలో రాళ్ళబూదుగురు ఎస్సై నరేష్ గుడిపల్లి ఎస్సై, శ్రీనివాసులు మరియు సిబ్బందిచే ప్రత్యేక బృందం ఏర్పరిచి ఈ కేసును దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా జనవరి 2 తేదీ ఆదివారం మధ్యాహ్నం శాంతిపురం మండలం కడపల్లి వద్ద కుప్పం- పలమనేరు జాతీయ రహదారిపై రాళ్ళ బుదుగురు ఎస్సై, గుడుపల్లి ఎస్సై, తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేయుచుండగా ఎస్. సిఖంధర్(27 సం.) ,ఎస్ సేటు (20 సం.), యారబ్ (20సం) షాదుల్లా (20 సం.) అను నలుగురు యువకులు రెండు ద్విచక్ర వాహనములతో వస్తూ ఉండి పోలీసులను చూసి పారిపోవుటకు ప్రయత్నించగా, వారిని పట్టుకుని వివరాలు అడగగా వారు తమిళనాడు రాష్ట్రం చెందిన క్రిష్ణగిరి వాసులు అని తెలిపారు. అదేవిధంగా వీరు కుప్పం పరిసర ప్రాంతాల్లో జరిగిన వరుస ద్విచక్ర వాహనాల దొంగతనాలు తామే చేసిన్నట్లు ఒప్పుకున్నారు. వీరి నుండి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసు కున్నట్లు పోలీసులు తెలిపారు. వీటి విలువ సుమారుతొమ్మిది లక్షలు గా పోలీసులు గుర్తించారు. ఈ చోరీలకు పాల్పడ్డ నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు కేసును ఛేదించిన కుప్పం రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ ను, అర్బన్ సీ.ఐ. శంకరయ్యను, రాళ్ళబుదు గురు ఎస్సై నరేష్, గుడిపల్లి ఎస్సై శ్రీనివాసులు,సిబ్బంది ని ఈ సంద్దర్భంగా అభినందించారు.

## మెట్రోకు పైసల్లేవ్

హైదరాబాద్,: హైదరాబాద్ ప్రజా రవాణాలో మెట్రోది కీలక పాత్ర. నగరంలో ప్రతి రోజూ దాదాపు 5 లక్షల మంది మెట్రోలో ప్రయాణాలు సాగిస్తుంటారు. నగరం ఓ మూల నుంచి మరో మూలకు వేగంగా, సుఖవంతంగా చేరుకునేందుకు ఎక్కువ మంది ప్రయాణికులు మెట్రోను ఆశ్రయిస్తుంటారు. ప్రస్తుతం ఎల్బీనగర్- మియాపూర్, జేబీఎస్- ఎంజీబీఎస్, నాగోల్- రాయదుర్గం మూడు కారిడార్లలో మెట్రో పరుగులు పెడుతోంది. దాదాపు 30కి పైగా ట్రైన్లు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. నగర విస్తరణ దృష్ట్యా మరిన్ని ప్రాంతాలకు మెట్రోను విస్తరించాలని రేవంత్ సర్కార్ డిసైడ్ అయ్యింది. మెట్రో సెకండ్ ఫేజ్‌లో భాగంగా.. కొత్తగా ఐదు కారిడార్లకు సిద్ధమయ్యారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్-హయత్‌నగర్‌కు, ఎల్బీనగర్ నుంచి శివరాంపల్లి మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి, ఎంజీబీఎస్ నుంచి ఓల్డ్ సిటీ మీదుగా చాంద్రాయణగుట్టకు, మియాపూర్ నుంచి పటాన్‌చెరు, మైండ్ స్పేస్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రోను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గాయపడిన...

## కుటుంబాలకు ఆదుకుంటాం

### ఎమ్మెల్యే డాక్టర్ థామస్



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:** రోడ్డుప్రమాదంలో మృతి చెందిన వెంకటేశ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియ జేసిన ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్, ప్రమాదంలో గాయపడిన 15 మంది క్షతగా త్రులకు మెరుగైన చికిత్స అందించాలని చిత్తూరు ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కి చరవాణి లో ఆదేశాలు జారీ చేసారు. మృతి చెందిన వెంకటేష్ కుటుంబానికి, క్షతగాత్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.చిత్తూరు జిల్లా వైద్యాధికారిణి కి 108 అంబులెన్సు నిర్లక్ష్యం పట్ల తన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వరిలో వెదురుకుప్పం మండలంలో,కార్వేటి నగరం మండలంలో సమయానికి అంబు లెన్స్ రాకపోవడం వలన ఇద్దరు మృతిచెందడం, పట్ల ఫిర్యాదు చేసిన ఇప్పటికీ పట్టించు కోకపోవడం వల్ల ప్రాణ నష్టం జరుగుతుం దని తన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఇలానే కొనసాగితే సంబంధిత అధికారుల మీద తగు చర్యలు తీసుకోవాల్సి వస్తుంద ని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ హెచ్చరించారు.

## నగరిలో ఘోర రోడ్డు ప్రమాదం

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు

క్షతగాత్రులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని అధికారులకు సూచించిన చిత్తూరు ఎంపీ



**చిత్తూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:**తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన చిత్తూరు జిల్లా, నగరి మండలం, రామా పురం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు చిత్తూరు పార్ల మెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాల కు హాజరైన ఆయన.., నగరి నియోజక వర్గంలో జరిగిన ఘోరరోడ్డు ప్రమాదఘటన పైస్పందించారు. మృతులకుటుం బాలకు తన ప్రగాఢ సాను భూతిని తెలియజేశారు. అలాగే క్షతగాత్రు లకు మెరుగైన వైద్యాన్ని అందించాలని అధికారులకు సూచించారు. దురదృష్టవ శాత్తు జరిగిన ఇలాంటి ఘటనలు భవి ష్యత్తులో పునరావృతంకాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. నగరి నియోజక వర్గంలో జరిగిన రోడ్డు ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందన్న చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు..,బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

### హృదయ రక్ష ఇంజక్షన్‌ను...

## సద్వినియోగం చేసుకోండి

### మెడికల్ సూపరింటెండెంట్ విజయ్ కుమారి






**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:** కుప్పం ఏరియా ఆసుపత్రిలో హృదయ రక్ష ఇంజక్షన్ అందుబాటులో ఉన్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ విజయ్ కుమారి తెలిపారు ఈ సందర్భంగా హృదయ రక్ష కార్యక్రమం పై అవగాహన కల్పించారు. చాతిలో నొప్పి శ్వాస ఆడక పోవడం వంటి లక్షణాలు ఉంటే అది గుండెపోటు కారణమని తెలిపారు. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి వచ్చి ఇంజక్షన్ చేసుకోవాలని, దీని విలువ రూ. 42వెలవరకు ఉంటుందని ఈ ఇంజక్షన్ ఉచితంగా పొందవచ్చని తెలిపారు.

# హిందూపురం మున్సిపల్ పీఠం టీడీపీ కైవసం

-ఓటింగ్ లో పాల్గొన్న ఎంపి, పార్థ సారథి- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

-మునిసిపల్ ఛైర్మెన్ గా ఎన్నికైన డి ఈ రమేష్ కుమార్



**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:**హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని సోమవారం టీడీపీ కైవసం చేసుకుంది. ఆరో వార్డు కౌన్సిలర్ రమేశ్ కుమార్ ఛైర్మన్గా ఎన్నికయ్యారు. చేతులెత్తే విధానంలో ఎన్నిక నిర్వహించారు. ఎన్డీఏ కూటమికి ఎంపీ, ఎమ్మెల్యే ఓటుతో కలిపి 23 మంది బలం ఉండటంతో మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని టీడీపీ సునాయసంగా దక్కించుకుంది. వైసీపీ అభ్యర్థి లక్ష్మికి అనుకూలంగా 14 ఓట్లు పడ్డాయి. ఆరు నెలల క్రితం వైసీపీ ఛైర్పర్సన్ పదవికి ఇంద్రజ రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది.మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో హిందూపురం ఎమ్మెల్యే పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ మరియు హిందూపురం పార్లమెంటు సభ్యులు బికే పార్థసారథి ఓటు వేసి టిడిపి అభ్యర్థికి మద్దతు పలికారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ గా ఎన్నుకోబడినటువంటి డిఈ రమేష్ కుమార్ కు డిక్లరేషన్ ఫారాన్ని శాసనసభ్యులు, మరియు పార్లమెంటు సభ్యులు, ఆర్ డి ఓ ఆనంద్ కుమార్, మునిసిపల్ కమీషనర్ సంగం శ్రీనివాసులు చేతుల మీదుగా అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూపురంలో చేస్తున్నటువంటి అభివృద్ధిని చూసి 13 మంది కౌన్సిలర్లు వాళ్ల వార్డులో అభివృద్ధి కోసం మా పార్టీలోకి చేరారు.వాళ్లు పార్టీ మారిన రోజు పార్టీ నుండి సస్పెండ్ చేసి ఈరోజు కొత్తగా కౌన్సిలర్లకు విప్ జారీ చేయడం అర్థరహితం.మీరు విలువలు లేని రాజకీయాలు చేశారు. కాబట్టి 151 సీట్లు వచ్చినా ఐదు సంవత్సరాలలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారు.మీకు కేవలం 11 సీట్లు వచ్చాయంటే మీ నిరంకుశ పాలనకి ప్రజలు పాడిన చరమగీతం అని తెలుసుకోండి.ఇప్పటికైనా ప్రజల కోసం రాజకీయాలు చేయడం నేర్చుకోండి అని అన్నారు.అనంతరం గెలిచినటువంటి మున్సిపల్ చైర్మన్ మరియు కార్పొరేటర్లు పార్లమెంట్ సభ్యులను ఘనంగా సత్కరించారు.శాసనసభ్యులు పార్లమెంటు సభ్యుల చేతుల మీదుగా డిక్లరేషన్ ఫార్మ్ ను డి.ఇ.రమేశ్ కుమార్ అందుకున్నారు.

## పీఈఎస్ వైద్య కళాశాలలో తరగతుల ప్రారంభోత్సవం






**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:**కుప్పం పీఈఎస్ వైద్య కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి అల్లయిడ్ హెల్త్ సైన్సెస్, బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్. ఆర్. కృష్ణరావు, పీఈఎస్ కాలేజ్ ఆఫ్ ఫీజియోథెరపీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సత్యశీలన్ పాల్గొన్నారు. ప్రారంభోత్సవ ప్రసంగంలో డాక్టర్ కృష్ణరావు హెల్త్ కేర్ రంగంలో అల్లయిడ్ హెల్త్ సైన్సెస్ యొక్క పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. వైద్య సేవలందించే విధానంలో బహుళ శాస్త్ర విధానానికి అవసరాన్ని వ్యక్తం చేస్తూ, అల్లయిడ్ హెల్త్ నిపుణులు డయాగ్నోస్టిక్స్, థెరప్యూటిక్ కేర్, రిహాబిలిటేషన్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన వివరించారు. పీఈఎస్ వైద్య కళాశాల విద్యలో ప్రపంచ స్థాయి బోధనా విధానాలు, ప్రాక్టికల్ క్లినికల్ ఎక్స్‌పోజర్, ఆధునిక విద్యా వనరులు అందిస్తున్నట్లు వివరించారు. "మేము విద్యార్థులను సమర్థవంతమైన ఆరోగ్య నిపుణులుగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నాము," అని ఆయన పేర్కొన్నారు.పీఈఎస్ కాలేజ్ ఆఫ్ ఫీజియోథెరపీ, వైస్ ప్రిన్సిపల్ కళాశాల యొక్క సృజనాత్మక విద్యా వాతావరణాన్ని ప్రశంసించారు. అల్లయిడ్ హెల్త్ మరియు ఫిజియోథెరపిస్టుల తోడ్పాటుతో రోగుల సేవలలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.


### వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టుల పై విచారణ జరిపించాలని..

## కలెక్టరేట్ ముందు ధర్నా

### విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్ హామీ



**అనంతపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 03:**అనంతపురం జిల్లా కూడేరు మండలం కరుట్లపల్లి గ్రామ నివాసి అయిన అంద వికలాంగుడు ముత్యాలన్న ఆయన భార్య ఇద్దరు వికలాంగులె.. 2023వ సంవత్సర ములో వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయుటకు ప్రభుత్వం అనుమతించిందనీ వాటిలో భాగంగ ముత్యాలన్న తో పాటు కుక్కు పోస్టుకు మరి కొంత మంది అప్లై చేసుకున్నారు అప్లై చేసిన వారిలో కొంత మంది ఫేక్ సర్టిఫికెట్లు పెట్టినట్లు ముత్యా లన్న గుర్తించడం జరిగింది. ఈవిషయమై అప్పటి జిల్లా కలెక్టర్ గౌతమి మేడం కి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు ముత్యాలన్న ఫిర్యాదు మేరకు ఆ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారి సర్టిఫికెట్లను పరిశీలించలని కలెక్టర్ మేడమ్ ఆర్డర్ వేయడంతో విచారణ చేసిన సంబంధిత అధికారులు ఇవి పేక్ సర్టిఫికెట్లు అని తేల్చి వారిపై ఎటువంటి చర్యలు లేకుండ తొలగించడము జరిగింది అప్పటికే ఈపేక్ సర్టిఫికెట్లలో ఒకరికి ఉద్యోగం ఇప్పిచ్చే విధంగ ఒప్పందం చేసుకున్న ఏ సెక్షన్ లో పనిచేస్తున్న కుమారి అనే సీనియర్ అసిస్టెంట్ ముత్యలన్నను నువ్వే కద కలెక్టర్ కి ఫిర్యాదు చేసినది నీవు ఎలా ఉద్యోగం తీసుకుంటావో నేను చూస్తా అంటూ ముత్యాలన్నా ను బెదిరించడమే కాకుండ దంపతులు ఇద్దరినీ చెప్పుకోలేని భాషలో సీనియర్ అసిస్టెంట్ గ పనిచేస్తున్న కుమారి నానాదుర్భాషలాడంజరిగిందని.. ప్రస్తుత కలెక్టర్ వినోద్ కుమార్ సార్ కి రాంగ్ రిపోర్ట్ ఇచ్చి ముత్యాలన్నకి అన్ని రకాల హర్వత ఉన్న పోస్టు రాకుండ చేయడమే కాకుండ అంద వికలాంగుడు ముత్యాలన్నాను ఆయన భార్యను మాన సికంగ వేధించడం జరిగింది. వీటి పైన ప్రస్తుత కలెక్టర్ వినోద్ కుమార్ సార్ విచారణ జరిపించాలని బాధ్యులైన సీనియర్ అసిస్టెంట్ కుమారి గారితో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని అంద వికలాంగుడైన ముత్యలన్న కుటుంబానికి న్యాయం చేయాలని కోరు చున్నాము అలాగే వికలాంగుల కోటాలో ఉద్యోగాలు పొంది ఆ ఉద్యోగాలకు వారు హాజరుకాకుండ వారి ప్లేసులో వేరే వారికి కొంత డబ్బులు ఇచ్చి వారితో విధులు నిర్వ హిస్తు వీరు బయట ప్రైవేటు పనులు చేసు కుంటూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు కావున తక్షణమే అటువంటి వారిని గుర్తిం చి వారిపై విచారణ జరిపించి, చర్యలు తీసుకో వాలని కోరుతున్నాము గతం నుండి నేటి వరకు వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టులలో ఉద్యోగాలు చేస్తున్న అన్ని డిపార్ట్మెంట్లలోనూ వారి సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేయాలని కోరుతున్నాము తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈధర్నా కార్యక్రమంలో విహెచ్పిఎస్ రాష్ట్ర అదికార ప్రతినిధి పెద్దన్నతో పాటు విహెచ్పి ఎస్ జిల్లా అధ్యక్షులు జానకి రామయ్య కళ మండలి జిల్లా అధ్యక్షులు పుల్లన్న విహెచ్పి ఎస్ మహిళ అధ్యక్షురాలు జయమ్మ విహెచ్పిఎస్ మహిళ కమిటీ నాయకురాలు వరాలమ్మ హుస్సేన్ బి ఈశ్వరమ్మ కళావతి నాయకులు ఎంఆర్పిఎస్ ఉమ్మడి జిల్లాల సామ్రాట్ మధు ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు బాలరాజు కృష్ణమూర్తి విహెచ్పిఎస్ నగర కార్యదర్శి చెన రాయు డు తదితర వికలాంగులు నాయకులు మహిళలు పాల్గొన్నారు.



## తెలంగాణకు కొత్త ఎయిర్ పోర్టులు



హైదరాబాద్ : తెలంగాణలో ఎయిర్‌పోర్టులు చాలా తక్కువ. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో నాలుగు, ఐదు ఎయిర్‌పోర్టులు ఉంటే.. రాష్ట్రంలో మాత్రం హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఎక్కటే దిక్కు. బేగంపేట ఎయిర్‌పోర్టు వీఐపీల కోసం వినియోగిస్తుండగా.. వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్టు నిజాం కాలంలో సేవలందించేది. ప్రస్తుతం మాత్రం శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి మాత్రమే విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఎయిర్ పోర్టులు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కీలక ప్రకటన చేశారు. పొరుగు రాష్ట్రాల్లో బస్ డిపోల మాదిరిగా ప్రతి 150 కి.మీ ఎయిర్‌పోర్టులు ఉంటే తెలంగాణలో మాత్రం అందుబాటులో లేవని చెప్పారు. రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ మేరకు వరంగల్ మామునూరు, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఎయిర్ పోర్టులు నిర్మించాలని డిసైడ్ అయ్యారు. ఈ మేరుకు కేంద్రానికి ప్రతిపాదనలు సైతం పంపించారు.తాజాగా.. తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. తాజా కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా... 120 కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని నాలుగు ప్రతిపాదిత ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. ప్రస్తుతం వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టుకు 696.14 ఎకరాల భూమి ఉంది. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు మరికొంత భూమి అవసరమని ౦౦ఎ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతో 253 ఎకరాలను ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అదనంగా కేటాయింలు చేసింది. ఇక్కడ బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు అడుగులు పడే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.ఇక కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కూడా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇక్కడ కూడా ప్రభుత్వ భూములు భారీగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మించనుండగా.. ఏఏఐ బృందం ఇప్పటికే ఫీజిబిలిటీ పరీక్షలను నిర్వహించింది. కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేస్తామని తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో వరంగల్ మామునూరు, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ఈ ఏడాదిలోనే అడుగులు పడనున్నాయి.

### రాయలసీమ జిల్లాలే లక్ష్యంగా...

## టీడీపీ పండుగ

కర్నూలు, : మొన్నటి ఎన్నికల్లో గెలిచాం. అధికారంలో ఉన్నా..ఇక అంతా లైట్ అంటే కుదరదు. వచ్చే ఎన్నికల కోసమే కాదు..ఫ్యూచర్ ప్లానింగ్ కూడా పకడ్బందీగా ఉండాలంటున్నారు టీడీపీ అధినేత చంద్రబాబు. రాయలసీమలో వైసీపీని తిరిగి పుంజుకోవ్వకుండా వ్యూహాలు రచిస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వ పరంగా రాయలసీమ నాలుగు జిల్లాలపై స్పెషల్ ఫోకస్ పెట్టింది వైసీపీ.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెగ్యులర్ పర్యటనలు..సీఎం చంద్రబాబు అభివృద్ధి పేరుతో రాయలసీమ వాసులకు మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే మహానాడుకు రాయలసీమనే వేదికగా ఎంచుకుంది టీడీపీ. పైగా జగన్ ఇలాఖ కడపలో పసుపు పార్టీ సంబురం హోరెత్తబోతోంది.మహానాడు టీడీపీకి ఒక పండుగ. పార్టీలో ఉన్న క్యాడర్ మొత్తం ఎంతో ఉత్సాహంగా పాల్గొంటుంది. 2023లో రాజమండ్రిలో టీడీపీ మహానాడు జరిగింది. ఆనాడు రాజమండ్రిలో నభూతో నభవిష్యత్తు అన్నట్లుగా పార్టీ కార్యక్రమాలు సాగాయి. సూపర్ సిక్స్ పథకాల గురించి ఆనాడే ప్రస్తావించారు. దాంతో గోదావరి జిల్లాలలో రాజకీయం గేర్ మార్చింది మహానాడు.అలా వైసీపీకి ఒక్క సీటు కూడా దక్కకుండా చేసి కూటమి కట్టి మరీ టీడీపీ గోదావరి తీరంలో రాజకీయాన్ని తమ వైపు తిప్పుకుంది. ఇక 2024లో మహానాడు నిర్వహించలేదు. అప్పటికి ఏపీలో ఎన్నికలు పూర్తి అయిపోయాయి. ఫలితాల కోసం వేచి చూసే పరిస్థితి ఉంది. దాంతో ఈ సారి ఘనంగా నిర్వహించేందుకు రెడీ అవుతున్నారు.ఇప్పుడు టీడీపీ బంపర్ విక్టరీ కొట్టి పూర్తి ఉత్సాహంలో ఉంది. పైగా వైసీపీ దారుణమైన ఓటమిని మూటగట్టుకుని..నేతల వరుస రాజీనామాలతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. సరిగ్గా ఇదే టైమ్‌లో కడపలో మహానాడు నిర్వహించాలని నిర్ణయించింది టీడీపీ. మే 27, 28 తేదీల్లో జరిగే మహనాడుకు ఇప్పటి నుంచే సన్నాహాలు చేయాలని పార్టీ నుంచి ఆదేశాలు వెళ్ళాయి. కడప గడపలో వైసీపీని కోలుకోకుండా చేయడం జగన్ సొంత ఇలాకాలో బస్తీమే సవాల్ విసరడం ద్వారా సీమలో రాజకీయాన్ని ఏకపక్షం చేయాలని టీడీపీ వ్యూహ రచన చేస్తోంది.52 అసెంబ్లీ సీట్లు ఉన్న రాయలసీమలో వైసీపీకి అరడజన్ సీట్లు కంటే కూడా తక్కువ వచ్చాయి. దాంతో రాయలసీమలో వైసీపీ గాలి పూర్తిగా తగ్గిపోయిందని టీడీపీ భావిస్తోంది. దాంతో తమకు ప్రజలు ఇచ్చిన మద్దతుతో అడ్డాగా మార్చుకోవాలని..రాయలసీమలో పూర్తి స్థాయిలో పైచేయి సాధించాలని చూస్తోంది.జగన్ సొంత జిల్లా ఆ పార్టీకి కంచుకోట అయిన కడపలో పది అసెంబ్లీ సీట్లు ఉంటే కేవలం మూడు మాత్రమే వైసీపీకి గత ఎన్నికల్లో దక్కాయి. ప్రభుత్వం కూడా రాయలసీమ అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. ఇప్పుడు రాజకీయంగా కూడా సీమలో సైకిల్‌ను నిరంతరంగా పరుగులు పెట్టించాలని టీడీపీ చూస్తోంది. అందుకే రాయలసీమకు గుండెకాయ లాంటి కడపను ఈసారి మహానాడుకు ఎంచుకున్నామంటున్నారు తెలుగు తమ్ముళ్లు.రాయలసీమ నాలుగు జిల్లాల్లో మొత్తం 52 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా మ్యాజిక్ ఫిగర్ 88 సీట్లు. అందులో సగానికంటే ఎక్కువ సీట్లు రాయలసీమ రీజియన్‌లోనే ఉన్నాయి. అందుకే వైసీపీని రాయలసీమలోనే కోలుకోలేని దెబ్బకొట్టాలని భావిస్తోందట టీడీపీ. అందుకోసం చంద్రబాబు చాణక్య వ్యూహాలనే అమలు చేస్తున్నారట.పక్కా వ్యూహంలో భాగంగానే తరచూ రాయలసీమ పర్యటనలు చేస్తున్నారట డిప్యూటీ సీఎం పవన్. ఈ మధ్యే కడప వెళ్ళి మరీ ఎంపీడీవో మీద జరిగిన దాడిని ఖండించి వచ్చారు. ఏకంగా రాయలసీమలోనే క్యాంప్ ఆఫీస్ పెడుతానంటూ ప్రకటించేశారు. రాయలసీమ మీ జాగీరు కాదు..గుండాగిరి చేస్తే ఊరుకునేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు పవన్. లేటెస్ట్‌గా కర్నూలు జిల్లాలో వెళ్లి రోజంతా అక్కడే ఉండి గ్రీన్ కో ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు.ఇదంతా ఎందుకు అంటే వైసీపీని రాజకీయంగా నిలువరించడానికేనన్న చర్చ జరుగుతోంది. రాయలసీమలో కూటమిలో ఉన్న బీజేపీ, జనసేన బలానికి..టీడీపీ బలం తోడైతే మరోసారి సీమలో ఎదురు ఉండదని భావిస్తున్నారట. అందుకే వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్‌గా ఉన్న రాయలసీమలోనే టీడీపీ మహానాడు నిర్వహించాలని డిసైడ్ అయ్యారట.ఇలా పార్టీ పండుగకు కడపను ఎంచుకోవడం వెనుక రాజకీయ వ్యూహం ఉందన్న చర్చ జరుగుతోంది.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036